సాక్షి
అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 11 । జూలై । 2025



ఎర్రచందనం దుంగల స్వాధీనం

రెండు వాహనాలతోపాటు రూ.13.68 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు పీలేరు డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపారు. - 8లో



అటవీ మార్గం మీదుగా తిరుమలకు అనుమతిలేదు

-ఏనుగుల సంచారం దృష్ట్యా శెట్టిగుంట నుంచి అటవీ మార్గం ద్వారా తిరుమలకు కాలినడకన ప్రజలు వెళ్లరాదని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.180	రూ.240

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1040 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ప్రజలు సంతృప్తి చెందేలా సేవలందించాలి : కలెక్టర్

రాయచోటి : ప్రజలు సంతృప్తి చెందేలా అధికారులు, సిబ్బంది సేవలందించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. ఈ మేరకు మార్గదర్శకులను, బంగారు కుటుంబాలను మ్యాప్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గురువారం అమరావతిలోని సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పేదరికం లేని సమాజం- పి-4 కార్యక్రమం, ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాల సేకరణ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు. సంక్షేమ శాఖలు వారి పరిధిలో ఉన్న హాస్టళ్లను అన్నింటినీ తనిఖీ చేసి నివేదికలను సమర్పించాలని కలెక్టర్ సూచించారు. వ్యాధుల వ్యాప్తి లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు.

శాకంబరి.. నమోస్తుతే



శాకంబరి అలంకరణలో అమ్మవారు

రాయచోటి టౌన్ : రాయచోటి భద్రకాళి అమ్మవారు శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాం కావడంతో గురువారం అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, ఆకుకూరలు, పండ్లు, కూరగాయలు, కందలతో అందంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. శాకంబరి..చల్లంగా చూడమ్మా అంటూ వేడుకున్నారు. ఆలయ ఈవో డివి రమణారెడ్డి, ప్రధాన అర్చకులు కృష్ణయ్యస్వామి, శంకరయ్యస్వామి, శేఖర్ స్వామి భక్తులు పాల్గొన్నారు.

వైభవం..సీతారాముల పౌర్ణమి కల్యాణం



కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట : ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో గురుపౌర్ణమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై సీతారాముల ఉత్సవ మూర్తులను కొలువుతీర్చారు. బంగారు ఆభరణాలు, పుష్పాలతో అలంకరించారు. ముందుగా అర్చకులు కలశ ప్రతిష్ట, యజ్ఞోపవీతధారణ, మాంగల్యపూజ, కర్పూర హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు.అనంతరం సతీసమేతుడైన కోదండరామస్వామికి అర్చకులు పౌర్ణమి కల్యాణం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు విచ్చేసి సీతారాముల కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించి తరించారు.కార్యక్రమంలో ఆలయ టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ఒంటిమిట్ట మండల ప్రత్యేకాధికారి బ్రహ్మయ్య, ఒంటిమిట్ట ఇన్‌చార్జ్ ఎంపీపీ లక్ష్మీదేవి దంపతులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వం..బ్రహ్మోత్సవం

రాజంపేట : తాళ్లపాక ఆలయాల వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సిద్దేశ్వర స్వామి,చెన్నకేశవ స్వామిని వాహనాల్లో ఊరేగింపు నిర్వహించారు.సిద్దేశ్వర స్వామి నంది వాహనంపై, శ్రీ చెన్నకేశవ స్వామి గరుడవాహనపై భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వాహన సేవలో పాల్గొని కాయ కర్పూరం సమర్పించుకున్నారు.కార్యక్రమంలో సర్పంచ్ గౌరీ శంకర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, టీటీడీ సిబ్బంది, భక్తులు, కళాకారులు పాల్గొన్నారు.

15 నుంచి మహిళలకు క్రీడా పోటీలు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల ప్రకారం ఈ నెల 15 నుంచి 17 వరకు ఖేలో ఇండియా స్కీమ్ ద్వారా మహిళలకు పలు క్రీడలను నిర్వహించనున్నట్లు డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాల ప్రత్యేక అధికారి కె, జగన్నాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలకు మూడు క్రీడాంశాలు అథ్లెటిక్స్, అర్చరీ, వెయిట్ లిఫ్టింగ్ పోటీలను నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. 22 ఏళ్లలోపు ఉన్న మహిళా క్రీడాకారిణులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

అంతా ఆర్భాటమే..

- మెగా పేరెంట్ మీటింగ్‌లో కూటమి నాయకులు, కార్యకర్తల హడావిడి
- అయ్యవార్లకు తప్పని తిప్పలు
- వసతుల లేమి గురించి ప్రశ్నించిన తల్లిదండ్రులు
- తల్లికి వందనం రూ.15 వేలు వచ్చిందంటూ పిల్లల నోట అబద్ధాలు పలికించారు



ముగ్గురు అవసరం ఉన్నా ఒకరే పనిచేస్తున్న జీవీపురం ప్రాథమిక పాఠశాల

రాయచోటి : మెగా పేరెంట్స్ కార్యక్రమాన్ని ఎంతో గొప్పగా నిర్వహించాలనుకున్న కూటమి ప్రభుత్వంలోని నాయకులకు చేదు అనుభవమే ఎదురైంది. జిల్లాలోని అనేక పాఠశాలలో మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం, మంచి విద్యను అందివ్వాలని అడిగిన విద్యార్థుల తల్లిదండ్రులకు వేదికలను పంచుకున్న కూటమి నాయకులు కార్యకర్తలు నుంచి సరైన సమాధానం కరువైంది. గురువారం జిల్లా వ్యాప్తంగా 2708 పాఠశాలలు, 27 జూనియర్ కళాశాల్లో మెగా పేరెంట్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయచోటిలో నిర్వహించిన పాఠశాల సమావేశానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు. పట్టణంలోని మరో పాఠశాలలో జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి పాల్గొన్నారు. సమావేశాల వేదికలపై విద్యార్థులతో మాట్లాడిస్తూ తల్లికి వందనం ద్వారా రూ. 15 వేలు పడిందంటూ విద్యార్థుల నోట అబద్ధాలు పలికించారు. మరికొన్ని పాఠశాలల్లో కూటమి పాలన వచ్చిన తర్వాత పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలని విద్యార్థుల చేత చెప్పించారు. రాయచోటి ప్రభుత్వ పాఠశాలలో మరుగుదొడ్లు ఒక వైపు ధ్వంసమై కనిపించినా అన్ని వసతులు ఉన్నాయని విద్యార్థుల మాటల్లో వినిపించారు. ప్రభుత్వమే 13 వేల రూపాయలు వేసినట్లు ప్రకటిస్తే స్థానిక నాయకులు మాత్రం గొప్పలు చెప్పుకునేలా అబద్ధాలను చిన్నారుల నోట పలికించడం గమనార్హం. జిల్లాలోని పాఠశాల కమిటీ సమావేశాల్లో అధికార పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు హడావుడి, హంగామాలు అధికం కావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు తలనొప్పిగా మారింది. పాఠశాలల్లో తగిన విధంగా వసతులు కల్పించకపోయినా, చదువులు లేకపోయినా అధికార పార్టీ నాయకులు కార్యకర్తలు హంగామా ఏంటంటూ తల్లిదండ్రులు విసుగు చెందారు. విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత ఉండడం లేదంటూ విద్యార్థులు తల్లిదండ్రులు సమావేశంలో చర్చించారు. కేవలం మీటింగ్‌లో సమయంలో మాత్రమే పిల్లలకు మంచి భోజనాలు పెడుతున్నారని మిగతా వేళల్లో నాణ్యత కరువైందని అక్కడి పెద్దలకు చెప్పుకున్నా ఫలితం లేకపోయింది. ప్రభుత్వం అందించిన బ్యాగులు కూడా నాణ్యత లేవని పలువురు విద్యార్థులు తల్లిదండ్రులు ప్రశ్నించారు. తల్లిదండ్రుల నుంచి ప్రశ్నల వర్షం రావడంతో సమావేశాలు హాజరైన నాయకులు, కార్యకర్తలు కంగుతిన్నారు. పాఠశాలలో వసతులు లేకుండా విద్యార్థులకు ఎలా మెరుగైన విద్యను అందిస్తారంటూ కొంత మంది తల్లిదండ్రులు కమిటీ పెద్దల ఎదుటనే నిలదీశారు. మెగా పేరెంట్స్ కార్యక్రమం సందర్భంగా ప్రతి విద్యార్థి వారి తల్లి పేరు మీద మొక్క నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని చెప్పిన అధికారులు ఆ దిశగా అడుగులు వేయలేదన్న విమర్శలు ఉన్నాయి.

అయ్యవార్లకు తప్పని తలనొప్పి..

గురువారం నిర్వహించిన మెగా పేరెంట్స్ కార్యక్రమం ఆయా పాఠశాలల్లోని అయ్యవార్లకు తలనొప్పిగా మారింది. విద్యార్థులు వారి తల్లిదండ్రుల సమావేశానికి స్థానిక ప్రజాప్రతినిధుల కంటే అధికార పార్టీ నాయకులు కార్యకర్తలు వేదికను పంచుకోవడంలో పోటీపడ్డారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులకు ఎవరిని వద్దనాలో అర్థం కాక తలలు పట్టుకున్నారు.

అరకొర సౌకర్యాలు

తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో అరకొర సౌకర్యాలు, నాణ్యతలేని భోజనాలు, టీచర్ల కొరతతో విద్యార్థుల భవిత ప్రశ్నార్థకంగా మారిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ డే కార్యక్రమం ఎస్ఎంసీ చైర్మన్ రాజన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో ఈ ఏడాది అన్ని తరగతుల్లోనూ 48 మంది ఉన్నారని, 6వతరగతిలో కేవలం 9 మంది మాత్రమే చేరారు. పాఠశాల గురించి అధికారులు పట్టించుకోకపోవడం, ఇంగ్లీషు, సైన్సు బోధించేందుకు టీచర్లు లేకపోవడం ప్రధాన కారణాలన్నారు.

టీచర్ల కొరత..బోధన ఎలా?

ఓబులవారిపల్లె : నియోజకవర్గంలోని జీవీ పురం, గాదెల పాఠశాల ప్రాథమిక పాఠశాలలో టీచర్ల కొరతతో విద్యార్థుల భవిత ప్రశ్నార్థకమేనని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. జీవీ పురం పాఠశాలలో నలభై విద్యార్థులు ఉన్నారు. గతంలో ఇక్కడ ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేవారు. ప్రస్తుతం ఒకరు మాత్రమే బోధన చేస్తున్నారు. దీంతో పిల్లలకు సరిగా పాఠాలు చెప్పలేకపోతున్నారని తల్లిదండ్రులు వాపోయారు. మండల వ్యాప్తంగా 63 ప్రాథమిక పాఠశాలలు ఉండగా అందులో 51 పాఠశాలల్లో ఒకరే ఉపాధ్యాయుడు ఉన్నారని, వారికి రిలీవర్ లేకపోవడంతో దాదాపు 42 మంది బదిలీ అయినా అక్కడే ఉన్నారన్నారు. వెంటనే పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని లేనిపక్షంలో తమ పిల్లల చదువుల పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

పిల్లలతో కూడా అబద్ధాలాడిస్తారా...



మాట్లాడుతున్న విద్యార్థిని అపూర్వ

రాయచోటి టౌన్ : జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, జూనియర్ కళాశాలలో గురువారం మెగా టీచర్స్ పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. అయితే ప్రసంగ సమయంలో చిన్న పిల్లలతో అబద్ధాలు చెప్పించారు. బాలికోన్నత పాఠశాలలో అపూర్వ అనే 9వ తరగతి విద్యార్థితో మాట్లాడించారు. ఈ విద్యార్థిని తల్లికి వందనం పథకంలో రూ15,000లు తన తల్లి అకౌంట్‌లో పడ్డాయని చెప్పడంతో పాటు పాఠశాల రూపు రేఖలు పూర్తిగా ఈ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేయించారని. అందుకు ఆయనకు అందరూ కృతజ్ఞతలు తెలిపాలని కోరింది. ఈ విధంగా ప్రభుత్వం చిన్న పిల్లలతో కూడా అబద్ధాలు చెప్పించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల్లో ప్రతిభ వెలికితీసేందుకు కృషి

మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి, పక్కన జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి : ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించి విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాయచోటిలోని కె రామాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించినట్లు చెప్పారు. పిల్లలను క్రమశిక్షణతో పెంచే విధంగా తల్లిదండ్రులు కూడా వారిపై దృష్టి సారించాలన్నారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పాఠ్యాంశాల ప్రగతితోపాటు వారిలో దాగిఉన్న నైపుణ్యాన్ని గుర్తించడం జరుగుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణకు పచ్చదనం పెంచే విధంగా మొక్కలను నాటే ఉద్దేశ్యంతో పిల్లలు తల్లిపేరుతో మొక్కనాటి వాటిని సంరక్షించే విధంగా వినూత్నమైన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అంతకుముందు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగమునిరెడ్డి పాఠశాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులు తల్లిదండ్రుల పాదాలను కడిగి మాతృ భక్తి చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ సుబ్రమణ్యం, ఎంఈఓలు బాలాజీ నాయక్, శివారెడ్డి, సమగ్ర శిక్ష సిఎంఓ కరుణాకర్, ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కడపకు వచ్చారో..!

- ఈగల్ హంట్ ప్రతినిధులకు టీడీపీ ముఖ్యనేత బెదిరింపులు
- రిమ్స్‌లో మేము చెప్పినట్లే నడుచుకోవాలి
- మావాడితోనే సెక్యూరిటీ టెండర్ కొనసాగించాలి
- అధికారం అండతో బెదిరింపులకు పాల్పడుతున్న వైనం



సాక్షి ప్రతినిధి, కడప : 'రిమ్స్‌లో ఏం చేసినా మేమే చేయాలి.. మా మనుషుల ద్వారానే చేపట్టాలి. తిరుపతి నుంచి వచ్చి మీరు ఇక్కడ కొనసాగిస్తామంటే చూస్తూ ఊరుకోవాలా. ఇక్కడ మేం లేమా? టెండర్ వేసేటప్పుడు కనీసం సంప్రదించేది లేదా? ఇష్టానుసారం టెండర్లు వేస్తే మీకు స్వాగతం చెప్పాలా? గౌరవంగా చెబుతున్నాం, మీరు కడపకు రావొద్దు..'జిల్లా టీడీపీ ముఖ్యనేత చేసిన హెచ్చరికలు ఇవి. అధికారం అండతో ఈగల్ హంట్ ప్రతినిధిపై రెచ్చిపోయిన వైనమిది.

కడప రిమ్స్‌లో ఇప్పటివరకు ఎక్స్‌పర్ట్ ఏజెన్సీ ద్వారా సెక్యూరిటీ సర్వీసు అందుతోంది. కాలపరిమితి పూర్తి కావడంతో టెండర్ల ప్రక్రియ చేపట్టారు. ఈ మేరకు రిమ్స్‌లో సెక్యూరిటీ సర్వీసు అందించేందుకు న్యూఢిల్లీకి చెందిన ఈగల్ హంట్ ఏజెన్సీ కొత్తగా టెండర్లు దక్కించుకుంది. ఈ నేపథ్యంలో ఈగల్ హంట్ ఏజెన్సీ ప్రతినిధి తిరుపతికి చెందిన వ్యక్తికి టీడీపీ ముఖ్యనేత నుంచి బెదిరింపు ఫోన్ కాల్స్ వెళ్లాయి. తమకు తెలియకుండా సెక్యూరిటీ సర్వీసు నిర్వహణకు వచ్చావో ఉంటుందంటూ హెచ్చరికలు జారీ చేశారు. ఎలాగోలాగా టెండర్లు పూర్తి అయ్యాయి. ఆ సెక్యూరిటీ సర్వీసులు తమ వర్గీయుడి ద్వారానే కొనసాగించాలంటూ ప్రజాప్రతినిధి కూడా ఫోన్ చేసి బెదిరింపులకు దిగినట్లు సమాచారం. స్వతహాగా మీరు టీటీడీ ఉద్యోగి, మాతో పెట్టుకోవద్దు.. అనవసర కాంప్లికేషన్స్ లేకుండా సెక్యూరిటీ సర్వీసు తమకు అప్పగించాలంటూ ఫోన్లలో టీడీపీ ముఖ్యనేత, ప్రజాప్రతినిధి ముప్పు తిప్పలు పెడుతున్నట్లు సమాచారం. ఇప్పటికీ కొలిక్కి రాకపోవడంతో వాడెలా నిర్వహిస్తాడో చూద్దామంటూ భీష్మించుకున్నట్లు సమాచారం.

శానిటేషన్ ప్రక్రియపై కూడా...


రిమ్స్‌లో ఇదివరకూ ఏ-1 ఏజెన్సీ శానిటేషన్ ప్రక్రియ కొనసాగిస్తోంది. ఈమారు టెండర్లలో ఎవరూ పాల్గొనకుండా టీడీపీ ముఖ్యనేత మంతనాలతోపాటు, వర్గీయుల బెదిరింపులు తెరపైకి వచ్చాయి. ఇక ఎవరూ టెండర్లుల్లో పాల్గొనరనే క్రమంలో తిరుపతికి చెందిన పద్మావతి ఫెస్ట్ కంట్రోల్ ఏజెన్సీ టెండర్లల్లో పాల్గొని టెండర్ దక్కించుకుంది. టెండర్ బిడ్ ఓపెన్‌లో ఎల్-1గా నిలిచింది. ఫైనాన్స్ బిడ్ అనుమతి దక్కాల్సి ఉంది. ఈదశలో 'కడపకు వచ్చి మీరు ఎలా కొనసాగిస్తా'రంటూ టీడీపీ ముఖ్యనేత నుంచి ఫోన్లు వెళ్లినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు పెట్టింది, అధికారికంగా పాల్గొన్నాం, టెండర్ దక్కుతోంది. కచ్చితంగా కొనసాగించి తీరుతామంటూ సదరు ప్రతినిధి నుంచి జవాబు రావడంతో టీడీపీ ముఖ్యనేత అవాక్కయినట్లు తెలుస్తోంది. సత్తా లేని వాడైతే అలా మాట్లాడరు, ఆ కాంట్రాక్టర్ ఎవరు, వారికి తెరవెనుక ఎవరున్నారో తెలుసుకోవాలంటూ అనుచరులను పురమాయించినట్లు సమాచారం. ఇంత పెద్ద ఎత్తున బెదిరింపులకు పాల్పడడం వెనుక అటు సెక్యూరిటీ, ఇటు శానిటేషన్ టెండర్ల ద్వారా ప్రతి నెలా రూ.59లక్షలు బిల్లింగ్ ఉండడమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. కాంట్రాక్టర్ నుంచి అప్పనంగా నెలనెలా కప్పం లభిస్తుండడంతో టీడీపీ ముఖ్యనేత రంకెలు వేస్తున్నట్లు సమాచారం. కాగా పద్మావతి ఫెస్ట్ కంట్రోల్ ఏజెన్సీ ఈ వ్యవహారాన్ని సీఎంఓ దృష్టికి తీసుకెళ్తున్నట్లు సమాచారం. ఫైనాన్స్ బిడ్ అప్రూవల్ రాగానే, సీఎంఓ ద్వారా రిమ్స్ అధికారులకు సిఫార్సులు చేయించుకొని కడపకు రానున్నట్లు తెలుస్తోంది.

తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యా ప్రగతి సాధ్యం

రాయచోటి జగదాంబసెంటర్ : పాఠశాలల్లో తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉన్నప్పుడే విద్యాప్రగతి సాధ్యమవుతుందని జిల్లా అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి అన్నారు. రాయచోటిలోని మదనపల్లె రోడ్డులో ఉన్న రాజు హైస్కూల్‌లో గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ఒక సంకల్పంతో విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలకు చేరుతారన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదివి మీరు చదువుకున్న స్కూల్‌కు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని తెలిపారు. అనంతరం తల్లిదండ్రులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు మొక్కలను అందజేశారు. రాజు విద్యాసంస్థల వ్యవస్థాపకుడు సుబ్బరాజు, పద్మావతి కాలేజీ ప్రిన్సిపల్ భాస్కర్‌రాజు, రాజు స్కూల్ హెడ్ మాస్టర్ సదాశివారెడ్డి, అకడమిక్ ఇంచార్జ్ ఫాతిమాపాల్గొన్నారు.

బాబూ.. కుప్పానికేనా నీళ్లు

- తంబళ్లపల్లె రైతాంగం ఆవేదన
- 30న కృష్ణా జలాలు తరలిస్తామని ప్రకటన
- ఇది సాధ్యమేనా అని చర్చించుకొంటున్న ప్రజలు



చెర్లోపల్లె రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న కృష్ణా జలాలు

మదనపల్లె : కుప్పంకు ఈనెల 30న కృష్ణా జలాలు పారిస్తామని చంద్రబాబు ప్రకటించి తన సొంత నియోజకవర్గంపై మమకారాన్ని చాటుకున్నారు. కరువు ప్రాంతమైన తంబళ్లపల్లె నియోజకవర్గంలో నెలకొన్న దుర్భిక్ష పరిస్థితులపై కనీసం పట్టించుకోకుండా శ్రీశైలం పర్యటనలో ఈనెల 30కల్లా కుప్పానికి నీటిని తరలిస్తామని ప్రకటించారు. దీనిపై సీఎం ప్రకటించేశారు, ఇప్పుడెలా అని హంద్రీ-నీవా ప్రాజెక్టు అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన పుంగనూరు ఉప కాలువ విస్తరణ పనులను రద్దు చేసి కరువు ప్రాంతానికి తీరని ద్రోహం చేసింది. ఇది సరిపోదన్నట్టు కాలువకు లైనింగ్ పనులు చేపట్టి రైతులకు కనీస ప్రయోజనం లేకుండా చేస్తోంది. లైనింగ్ పనులపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితుల్లో చంద్రబాబు 30నాటికి కుప్పంకు కృష్ణా జలాలు పారిస్తామని ప్రకటించి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తేశారు. కుప్పానికేనా నీళ్లు అని తంబళ్లపల్లె రైతాంగం ప్రశ్నిస్తోంది.

20 రోజుల్లో సాధ్యమా

జిల్లాలోని తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాల్లో పుంగనూరు ఉపకాలువకు కాంక్రీట్ లైనింగ్ పనులు చేస్తున్నారు. ఈ పనులపై అధికారుల కనీస పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టాతీరిన పనులు సాగుతున్నా పట్టించుకునే పరిస్థితులు కనిపించడం లేదు. పనులు జరుగుతుండగా నీళ్లు పారిస్తే కాలువ నాణ్యత బట్టబయలయ్యే అవకాశం కూడా ఉంది. దీనికి అధికారులు అంగీకరిస్తారా అన్నది అనుమానమే. ఈ పరిస్థితుల్లో వచ్చే 20 రోజుల్లో లైనింగ్ పనులు పూర్తి కావడం అసాధ్యం. దీనికితోడు పనులు పెండింగ్‌లో పెట్టి నీటిని తరలించాలనుకుంటే ముందుకు వెళ్లవచ్చు. దీనివల్ల పనులకు కలిగే నష్టాలు, ఇబ్బందులపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది అధికారులపైనే ఆధారపడి ఉంది. అయితే అధికారులు 30కి నీళ్లను తరలించే సాధ్యాసాధ్యాలపై తర్జన భర్జన పడుతున్నట్టు చెబుతున్నారు. సీఎం ప్రకటించిన తేదికి సాధ్యం కాకపోతే ఏం చేయాలన్న దానిపై సమీక్షించనున్నారని చెబుతున్నారు.

నాలుగు నెలల క్రితమే సత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్‌లో కృష్ణా జలాలు నిండుగా ఉన్నాయి. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని తరలించాల్సిన అవసరం లేదు. 1.681 టీఎంసీల నీళ్లు నిల్వ ఉండగా అవి కిందకు పారించక నిలిపివేయడంతో అందులో 300 ఎంసీఎఫ్‌టీ నీళ్లు ఆవిరి అయిపోయి ఉండొచ్చని అంచనా. ఈ నీటిలో కొంత ప్రధానకాలువలోకి మళ్లించినా అవి సద్వినియోగం కాక తరలింపు నిలిపివేశారు. ప్రస్తుత వరదతో శ్రీశైలం ప్రాజెక్టు నిండినా అక్కడి నుంచి అనంతపురంజిల్లాలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు కృష్ణా జలాలు తరలించుకోవచ్చు. సీఎం ప్రకటించినట్టు 30కి చెర్లోపల్లె నుంచి నీళ్లను పుంగనూరు ఉపకాలువలోకి విడుదల చేస్తే..అవి కాలువలోకి ప్రవహించే నీటి సామర్థ్యం మేరకు ఎన్నిరోజులు తరలించోచ్చో అంచనా వేసి ఆ తరవాత జీడిపల్లి రిజర్వాయర్ నుంచి నీటిని చెర్లోపల్లెకు తరలించాల్సి ఉంటుంది.

చంద్రప్రభ వాహనంపై సౌమ్యనాథస్వామి



చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చిన స్వామివారు

నందలూరు : నందలూరు శ్రీ సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం రాత్రి కృష్ణుడి అలంకారంలో చంద్రప్రభ వాహనంపై స్వామివారు మాడవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు కాయకర్పూరం సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. అంతకుముందు ఉదయం సౌమ్యనాథస్వామి కూర్మాలంకారంలో సూర్యప్రభ వాహనంపై మాడవీధుల్లో విహరించారు.భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం శ్రీ సౌమ్యనాథసేవా ట్రస్ట్ అన్నదాన సత్రంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథ స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.

నేడు ట్రాఫిక్ డైవర్షన్

శ్రీ సౌమ్యనాథస్వామి కల్యాణోత్సవం సందర్భంగా శుక్రవారం నందలూరు టౌన్‌లో ట్రాఫిక్ డైవర్షన్ చేయనున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు.గురువారం ఆయన మాట్లాడుతూ పొత్తపి, చెన్నయ్యగారిపల్లి, లేబాక గ్రామాల వైపు నుంచి నందలూరు టౌన్‌కు వచ్చే ప్రజలు ఆలయం వైపు దారిలో రాకుండా ఈదరపల్లి, దుర్గాపురం మీదుగా వెళ్లాలని తెలిపారు. కల్యాణానికి వచ్చే భక్తులు మాత్రం నందలూరు హరిజనవాడ దగ్గర ఉన్న పార్కింగ్ ప్రదేశంలో వాహనాలు నిలిపి గుడి వద్దకు కాలినడకన రావాలన్నారు. ప్రజలు, నాయకులు పోలీసు వారికి సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

మద్యం సీసాలు స్వాధీనం



అక్రమ మద్యాన్ని సీజ్ చేసిన ఏఈఎస్, ఎక్సైజ్ పోలీసులు

రైల్వేకోడూరు అర్బన్ : నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి, చిట్వేలి, కోడూరు పరిధిలలో దాడులు నిర్వహించి 51 మద్యం సీసాలు, ముగ్గురిని అరెస్టు చేసినట్లు రాయచోటి ఏఈఎస్ జోగేంద్ర తెలిపారు. స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన గురువారం వివరాలు వెల్లడించారు. నవోదయ 2.0లో భాగంగా జిల్లా వ్యాప్తంగా 33 నాటుసారా కేసులు నమోదు చేసి 29 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే 90 లీటర్ల నాటుసారా, 2810 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేశామన్నారు. జిల్లాలో నాటుసారా విక్రయాలు జరిపినా, అక్రమ మద్యం అమ్మకాలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ పోలీసులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో లారీ దగ్ధం



లారీలో నుంచి చెలరేగుతున్న మంటలు

మదనపల్లె : అగ్ని ప్రమాదంలో లారీ దగ్ధమైన ఘటన బుధవారం రాత్రి మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని బైపాస్‌రోడ్డులోని కృష్ణదేవరాయ సర్కిల్ పుంగనూరు రోడ్డులో నిలిపి ఉంచిన లారీలో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో.. బాధితులు వెంటనే అగ్నిమాపక శాఖ కార్యాలయానికి సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన అగ్నిమాపకశాఖ ఇన్‌స్పెక్టర్ శివప్ప సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి వెళ్లారు. మండుతున్న వాహనంపై నీటిని చిమ్మి మంటలు ఆర్పివేశారు. బ్యాటరీ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగి వుంటుందని యజమాని గౌస్‌ఖాన్ చెప్పారు. ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల నష్టం వాటిల్లినట్లు తెలిపారు.

ఫుడ్ కార్పొరేషన్ అధికారుల పర్యటన



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : న్యూఢిల్లీకి చెందిన ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు గురువారం జమ్మలమడుగు నియోజకవర్గంలో పర్యటించారు. గొరిగెనూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రం, రైతు సేవ కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే జమ్మలమడుగు వ్యవసాయ మార్కెట్‌యార్డును సందర్శించి రైతులకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. అనంతరం కడపలోని బఫర్ గోడౌన్‌కు చేరుకుని బియ్యం నాణ్యత, పోర్టిఫైడ్ బియ్యం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి శిరీష, జిల్లా పౌరసరఫరాల మేనేజర్, ఫుడ్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

మండల సర్వేయర్ ఆత్మహత్యాయత్నం

- పని ఒత్తిడే కారణమమా!
- నిద్రమాత్రలు మింగిన వైనం



చికిత్స పొందుతున్న మండల సర్వేయర్ హసీన్‌తాజ్



మండల సర్వేయర్‌ను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

పెద్దమండ్యం : పెద్దమండ్యం మండల సర్వేయర్ హసీన్‌తాజ్ గురువారం నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. పని ఒత్తిడి ఎక్కువ కావడంతోనే పెద్దమండ్యంలోని ఓ మెడికల్ షాపులో నిద్రమాత్రలు కొనుగోలు చేసి మింగినట్లు ఆమె తెలిపారు. వివరాలలోకి వెళితే... మదనపల్లె క్రిష్ణానగర్‌కు చెందిన హసీన్‌తాజ్ మండల ఇన్‌చార్జి సర్వేయర్‌గా గతంలో విధులు నిర్వహించారు. ఇటీవల రెగ్యులర్ మండల సర్వేయర్‌గా బాధ్యతలు చేపట్టారు. మండలంలోని బంద్రేవు, దిగువపల్లె గ్రామాల పరిధిలో రీసర్వేతోపాటు, బయోగ్యాస్ ప్లాంట్ కోసం విలేజ్ సర్వేయర్‌లు సర్వే నిర్వహించారు. ఈ క్రమంలో బుధవారం మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్.. గుర్తించిన భూములను పరిశీలించారు. అనంతరం కార్యాలయంలో వీఆర్‌వోలు, విలేజ్ సర్వేయర్‌లతో సమీక్ష నిర్వహించారు. భూముల రీ సర్వేపై తహసీల్దార్ తేజస్వి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విలేజ్ సర్వేయర్‌లకు సూచనలు చేశారు. అయితే రాత్రి సమయం కావడంతో విలేజ్ సర్వేయర్‌లు ఇళ్లకు వెళ్లాలని మండల సర్వేయర్ తహసీల్దార్‌కు తెలిపారు. ఈ విషయంలో తహసీల్దార్, మండల సర్వేయర్ మధ్య కాస్త వాగ్వివాదం జరిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కార్యాలయానికి వచ్చిన మండల సర్వేయర్ కార్యాలయంలో కాసేపు ఉన్నారు. కార్యాలయం నుంచి పెద్దమండ్యంలోని మెడికల్ షాపునకు వెళ్లి నిద్రమాత్రలు తీసుకున్నారు. పెద్దమండ్యం రైతు సేవా కేంద్రం వద్ద నిద్రమాత్రలు మింగి సెల్ స్విచ్ ఆఫ్ చేసి ఉండిపోయారు. కార్యాలయానికి ఎంత సేపటికీ రాకపోవడంతో.. విలేజ్ సర్వేయర్‌లు ద్విచక్ర వాహనాల్లో వెళ్లి తిరుగుతుండగా రైతు సేవాకేంద్రం వద్ద ఆమె పడి ఉండగా గుర్తించారు. వెంటనే ప్రైవేటు వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు చేయించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సర్వేయర్ తాను ఆత్మహత్యకు ప్రయత్నించడానికి గల కారణాలు వీడియో ద్వారా తెలియజేశారు. ఇదిలా ఉండగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఉన్న తహసీల్దార్‌కు మండల సర్వేయర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ విషయమై మదనపల్లె సబ్ కలెక్టర్‌కు నివేదించినట్లు తహసీల్దార్ తెలిపారు. భూముల రీ సర్వే, బయోగ్యాస్ ప్లాంట్ భూముల విషయంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించానే కానీ, ఎక్కడా పని ఒత్తిడి చేయలేదని తహసీల్దార్ చెప్పారు. కాగా మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సర్వేయర్‌ను సబ్ కలెక్టర్ పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లతో మాట్లాడారు. సబ్ కలెక్టర్ వెంట సర్వే ఉన్నతాధికారులు ఉన్నారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం



ఎర్రచందనం, వాహనాలతోపాటు నిందితులను అరెస్ట్ చేసిన ఫారెస్ట్ అధికారులు

పీలేరు : రెండు వాహనాలతోపాటు రూ.13.68 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు పీలేరు డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పులిచెర్ల – కల్లూరు మార్గంలో ఎర్రచందనం తరలిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారంతో పులిచెర్ల సమీపంలో రైల్వే బ్రిడ్జి వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. గురువారం తెల్లవారుజామున రెండు వాహనాలు అనుమానాస్పదంగా రావడంతో.. ఫారెస్ట్ సిబ్బంది అప్రమత్తమై వాహనాలు ముట్టడించారు. వాహనాలు పరిశీలించగా.. ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. 181 కేజీల బరువు గల 8 ఎర్రచందనం దుంగలతోపాటు రెండు వాహనాలు స్వాధీనం చేసుకుని తిరుపతి బొమ్మకుంటకు చెందిన పవన్‌కల్యాణ్, నరసింహులు అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. మల్లికార్జున అనే మరో నిందితుడు పరారైనట్లు డీఎఫ్‌వో చెప్పారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌ఎస్‌వో ప్రకాష్‌కుమార్, ప్రతాప్, రెడ్డి ప్రసాద్, చరణ్, దేవేంద్ర, నరేష్, వంశీ, హర్ష, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

నలుగురు స్మగ్లర్లు అరెస్ట్

తిరుపతి మంగళం : అన్నమయ్య జిల్లా సానిపాయ రేంజ్ అటవీ ప్రాంతంలో నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేయడంతో పాటు, వారి నుంచి 22 ఎర్రచందనం దుంగలు, మూడు మోటారు సైకిళ్లను గురువారం తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్సు ఎస్పీ పి.శ్రీనివాస్, డీఎస్పీ జి.బాలిరెడ్డి అధ్వర్యంలో ఆర్‌ఎస్‌ఐ ఎం. మురళీధరరెడ్డి టీమ్ బుధవారం రాత్రి నుంచి సానిపాయ పరిధిలోని వీరబల్లి మీదుగా గడికోట వైపు కూంబింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున నాయనూరు ప్రాంతం చేరుకోగా అక్కడ మూడు మోటారు సైకిళ్లు, 22 ఎర్రచందనం దుంగలు కనిపించాయి. వాటిని స్వాధీనం చేసుకోవడంతోపాటు నలుగురు స్మగ్లర్లను అరెస్ట్ చేశారు. వారిని అన్నమయ్య జిల్లా వాసులుగా గుర్తించారు. దుంగలతో సహా వారిని తిరుపతిలోని టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించగా, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి విచారణ చేశారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులకు గాయాలు

హెల్మెట్ ధారణతో తప్పిన పెనుముప్పు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయుడు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని నక్కవాండ్లపల్లె సమీపాన స్కూటర్‌ను ఆటో ఢీకొట్టడంతో.. స్కూటర్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. రాయచోటికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు గురువారం మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించుకొని సాయంత్రం సుండుపల్లె నుంచి రాయచోటికి వస్తున్నారు. నక్కవాండ్లపల్లె సమీపానికి రాగానే.. రాయచోటి వైపు నుంచి సుండుపల్లె రోడ్డు వైపు వస్తున్న ఆటో వీరి స్కూటర్‌ను ఢీకొంది. ఈ సంఘనటలో స్కూటర్‌పై వస్తున్న ఉపాధ్యాయులు ప్రసాద్ నాయక్, శ్రీనివాసులు గాయపడ్డారు. వీరిని స్థానికులు వెంటనే 108 ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ సీఐ విశ్వనాథరెడ్డి తన సిబ్బందితో వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. స్కూటర్‌పై వస్తున్న ఇద్దరు హెల్మెట్ ధరించి వస్తుండటంతో తలకు బలమైన గాయాలు కాలేదని సీఐ తెలిపారు. హెల్మెట్ ధరించి ఉండటంతో ప్రాణాపాయ స్థితి నుంచి రక్షింపబడ్డారని చెప్పారు.

మైదుకూరులో విషాదం

మైదుకూరు : కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంతో మైదుకూరులో విషాదం నెలకొంది. స్థానిక నంద్యాల రోడ్డులోని మహబూబ్ నగర్ ప్రాంతానికి చెందిన కమాల్ బాషా కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు విహార యాత్రకు వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదానికి గురయ్యారు. సంఘటనలో కమాల్ బాషాతోపాటు ఆయన మరదలు మున్ని, మనుమరాలు నదియా మృతి చెందడం.. వాహనంలో ఉన్న మిగిలిన వారు గాయపడటంతో కమాల్ బాషా బంధువులు కన్నీరు అవుతున్నారు.

అటవీ మార్గం మీదుగా తిరుమలకు అనుమతిలేదు

- ఏనుగుల సంచారం దృష్ట్యా ప్రజలకు సూచనలు
- రాజంపేట సబ్‌కలెక్టర్ వైకోమ్ నైదియాదేవి



కాలిబాట భక్తులకు అవగాహన కల్పించి వెనక్కు పంపుతున్న పోలీసులు

రాజంపేట : రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట నుంచి అటవీ మార్గం ద్వారా తిరుమలకు కాలినడకన ప్రజలు వెళ్లరాదని, ఏనుగుల సంచారం దృష్ట్యా ప్రజలకు ఈ సూచనలు చేస్తున్నట్లు రాజంపేట సబ్ కలెక్టర్ వైకోమ్ నైదియాదేవి పేర్కొన్నారు. ఆమె గురువారం మీడియాతో మాట్లాడుతూ రైల్వేకోడూరు మండలంలోని శ్రీవెంకటేశ్వర నేషనల్ పార్క్ (ఎస్‌వీఎన్‌పి) బాలపల్లె (కోడూరు మండలంలోని శెట్టిగుంట –కుక్కల దొడ్డి –మామండూరు) నుంచి తిరుమలకు వెళ్లే అటవీ మార్గంలో ప్రస్తుతం అడవి ఏనుగుల సంచారం చురుకుగా ఉన్న కోర్‌ఖ ఫారెస్టు ప్రాంతం మీదుగా వెళ్తున్నాయని అటవీ శాఖ వారు తెలియజేశారన్నారు. గత కొన్ని రోజులుగా అటవీ శాఖ ఈ మార్గంలో పిల్లలతో ఉన్న ఏనుగుల మంద తరచుగా సంచరిస్తున్నట్లు సూచించే బహుళ దృశ్యాలు, ప్రత్యక్ష ఆధారాలు (పేడ,పాదముద్రలు, దాణా సంకేతాలు) నమోదు చేసినట్లు.. ఈ కదలికలను అటవీ సిబ్బంది, కెమెరా ట్రాప్‌ల డేటా రెండు నిర్ధారించినట్లు తెలిపారన్నారు. అడవి ఏనుగుల అనూహ్యమైన స్వభావాన్ని దృష్టిలో పెట్టుకొని, ముఖ్యంగా వేసవిలో నీరు, మేత వంటి వనరులు తక్కువగా ఉన్నప్పుడు, ఎక్కువగా దాడులకు పాల్పడే అవకాశం ఉంటుందన్నారు. కావున ఈ సమయంలో ఈ మార్గం ద్వారా యాత్రికులను తిరుమలకు ప్రయాణించడానికి అనుమతించడం వల్ల ప్రజా భద్రతకు తీవ్రమైన ముప్పును కలిగిస్తుందన్నారు. ఇటీవల జరిగిన ఏనుగల దాడుల నేపథ్యంలో, ముందస్తు నివారణ చర్యలలో భాగంగా కుక్కలదొడ్డి మార్గం ద్వారా తిరుమలకు కాలినడకన వెళ్లడం ప్రజలకు శ్రేయస్కరం కాదన్నారు. కాబట్టి ప్రస్తుతానికి ఈ రహదారి మీదుగా ప్రయాణించడాన్ని నివారించడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. కావున ప్రజలు అర్థం చేసుకొని తిరుమల కాలినడకన ఈ మార్గంలో వెళ్లకూడదని తెలియజేస్తున్నామని వివరించారు.

పాదయాత్ర భక్తులను వెనక్కు పంపిన పోలీసులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని కుక్కలదొడ్డి అటవీ ప్రాంత అన్నమయ్య కాలిబాటలో తిరుమలకు వెళ్తున్న ఎనిమిది వందల మంది యాత్రికులను రాజంపేట ఏఎస్పీ మనోజ్ తివారీ హెగ్డే ఆధ్వర్యంలో కోడూరు సీఐ హేమసుందర్ రావు, సిబ్బంది గురువారం భక్తులకు అవగాహన కల్పించి వెనక్కు పంపారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ అన్నమయ్య కాలిబాటకు వెళ్లే ప్రాంతాలలో, తలకోనకు వెళ్లే కాలిబాట ప్రాంతాలలో ఏనుగులు ఎక్కువగా సంచరిస్తున్నాయని, దీనివల్ల గతంలో కూడా భారీ ఎత్తున ప్రాణనష్టం వాటిల్లిందని, అందువలన ఎవరినీ అటవీ ప్రాంతాలలోకి పంపడం లేదని భక్తులకు తెలియజేశారు.

వేంపల్లె ఘటనలో 150 మందికి పైగా కేసులు

- పోలీస్‌స్టేషన్‌పై దాడి చేశారని కానిస్టేబుల్ ఫిర్యాదు
- ఎస్పీ ఆదేశాల మేరకు నమోదు



వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో పగిలిన కిటికీ అద్దాలు (ఫైల్)

వేంపల్లె : వేంపల్లె ఘటనలో 150 మందికి పైగా కేసులు నమోదు చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీ నాయక్ తెలిపారు. కానిస్టేబుల్ బి.రామాంజనేయులు ఫిర్యాదు మేరకు.. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాలతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం డీఎస్పీ మీడియాతో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే.. 'వేంపల్లెలోని పక్కీర్‌పల్లెకు చెందిన మైనర్ బాలిక అదృశ్యంపై పోలీస్‌స్టేషన్‌పై దాడి చేసిన ఘటనలో 150 మందికి పైగా కేసులు నమోదు అయ్యాయి. ఈ నెల 7వ తేదీన సాయంత్రం 7 గంటల సమయంలో పోలీస్ స్టేషన్‌లో సెంట్రీగా రామాంజనేయులరెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో వేంపల్లె పంచాయతీ పరిధిలోని పక్కీర్‌పల్లెకు చెందిన సయ్యద్ సుమియా, చింతలమడుగుపల్లెకు చెందిన మడకబాబులు ప్రేమించుకున్నారని, వారిని మధ్యాహ్న సమయంలో ముచ్చుకోన దగ్గర ఉన్న వజ్రాల గుట్టలో ఉండగా.. సుమియా తల్లి దండ్రులు చూసి మడక బాబుపై చర్యలు తీసుకుని, న్యాయం చేయాలని పోలీసు స్టేషన్ వద్దకు వచ్చారు. ఈ నేపథ్యంలో మడక బాబుతోపాటు వల్లెపు గంగాధర్, విజయ్ కుమార్‌లను అదుపులోకి తీసుకొని విచారణ చేస్తుండగా ముస్లిం వర్గానికి చెందిన పక్కీర్‌పల్లెకు చెందిన సయ్యద్ మహమ్మద్ మూసా, రాజీవ్ నగర్ కాలనీకి చెందిన మస్తాన్, వేంపల్లెకు చెందిన మాజీ జెడ్పీటీసీ షబ్బీర్, బిడ్డాలమిట్టకు చెందిన అబ్దుల్, ఇబ్రహీం, హైదర్ వలి (లాడెన్), మదీనాపురానికి చెందిన గుజిరి దర్బార్, అక్బర్, ఇబ్రహీం, సమీర్, ఈసుబ్, కోహినూర్ నజీర్‌లతోపాటు దాదాపు 150 మందికి పైగా మూకుమ్మడిగా పోలీస్ స్టేషన్ అవరణలోకి వచ్చి మడక బాబుపై వెంటనే చర్యలు తీసుకోవాలని గొడవకు దిగారు. నిందితులను విచారణ చేస్తున్నామని పోలీసులు ఎంత చెప్పినా వినకుండా పోలీసులు డౌన్ డౌన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. పోలీసులనే హతమార్చాలనే ఉద్దేశంతో రాళ్లు విసరగా హెడ్ కానిస్టేబుల్ సాయిబాబా, కానిస్టేబుల్ కిరణ్ కుమార్, మహమ్మద్ ఆలీ, నజీర్ అహమ్మద్ తప్పించుకున్నారు. పోలీస్‌స్టేషన్ ముట్టడిదారులు అంతటితో ఆగకుండా రాళ్లు తీసుకుని పోలీస్ స్టేషన్ కిటికీ అద్దాలు, వరండాలోని ఇనుప కుర్చీ, వెనుక వైపు ఉన్న డోరును ధ్వంసం చేసి ప్రభుత్వ ఆస్తి నష్ట పరిచారు. అంతే కాకుండా పోలీసు యూనిఫాంలో ఉన్న వారికి విధులకు ఆటంకం పరిచినట్లు ఫిర్యాదులో తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు' డీఎస్పీ వివరించారు.

పోలీసుల అదుపులో 40 మంది?

వేంపల్లె : వేంపల్లె పోలీస్‌స్టేషన్ ముట్టడి కేసులో 200 నుంచి 300 మందిని అరెస్టు చేసే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే పోలీస్ స్టేషన్‌ను ముట్టడి చేసిన కేసులో 40 మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోలీస్ స్టేషన్‌పై దాడి చేసిన వారిని అదుపులోకి తీసుకోవాలనే ఉద్దేశంతో నాలుగు బృందాలుగా పోలీసులు ఏర్పడి వేంపల్లెలో జల్లెడ పట్టడం జరుగుతోంది. గురువారం వేంపల్లెలో ఉన్న 40 మందిని పోలీసులు అదుపులోకి తీసుకుని ఇతర ప్రాంతాల పోలీస్‌స్టేషన్లకు తరలించినట్లు సమాచారం. వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో పోలీసులు గాలింపు చర్యలు తీసుకోవడంతో.. పోలీస్ స్టేషన్ వద్దకు వచ్చిన చాలా మంది వేంపల్లెను విడిచి పెట్టి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడం జరిగింది.బాలిక తండ్రి మాబువలి ఫిర్యాదు మేరకు మడక బాబుపై అత్యాచార కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు.


భర్త మూడో పెళ్లికి యత్నం.. భార్య ఆత్మహత్య



రామలక్షుమ్మ (ఫైల్)

బద్వేలు అర్బన్ : ఆ వ్యక్తికి అప్పటికే రెండు పెళ్లిళ్లు అయ్యాయి. ఆరుగురు సంతానం కూడా ఉన్నారు. అయినా ఆయన మూడవ పెళ్లికి సిద్ధమయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన మొదటి భార్య కత్తితో పొడుచుకుని ఆత్మహత్య చేసుకుంది. బుధవారం అర్ధరాత్రి బద్వేలులో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని సుమిత్రానగర్ (ఎరుకలవీధి)కు చెందిన జగన్నాథం రవి సుమారు 25 సంవత్సరాల క్రితం కడప నగరంలోని తిలక్‌నగర్ ఎస్టీ కాలనీకి చెందిన రామలక్షుమ్మ (42)ను వివాహం చేసుకున్నాడు. మరికొన్నేళ్లకు రామలక్షుమ్మ సమీప బంధువును కూడా వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో ఇటీవల రవి రాయచోటికి చెందిన తన సమీప బంధువుల అమ్మాయిని మూడవ వివాహం చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈ విషయమై తరచూ రామలక్షుమ్మ, రవిల మధ్య గొడవలు జరుగుతుండేవి. ఇటీవల రవి కొద్ది రోజులు ఇంటి పట్టున లేకుండా రాయచోటికి వెళ్లి వచ్చాడు. ఇంటికి వచ్చిన తర్వాత భార్య రవిని ప్రశ్నించింది. ఇదే విషయమై బుధవారం రాత్రి కూడా ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమయంలో తాను తప్పనిసరిగా నా బంధువుల అమ్మాయిని వివాహం చేసుకుంటానని రవి తేల్చి చెప్పాడు. 'నీవు మరో వివాహం చేసుకుంటే నేను చనిపోతాను' అని రామలక్షుమ్మ తెలిపింది. 'నీవు ఏమైనా నాకు ఫర్వాలేదు. నేను పెళ్లి చేసుకునే తీరుతాన'ని రవి తెలిపాడు. దీంతో మనస్తాపానికి గురైన రామలక్షుమ్మ ఇంటిలోని మరో గదిలోకి వెళ్లి గడియ పెట్టుకుని కత్తితో కడుపులో, ఎడమ చేతిపైన పొడుచుకుంది. చుట్టుపక్కల వారు గమనించి రామలక్షుమ్మను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. తమ అక్క మృతికి కారణమైన రవిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రిమ్స్‌లో అరుదైన శస్త్ర చికిత్సలు



చికిత్స పొందుతున్న మహిళతో సూపరింటెండెంట్, వైద్యులు

కడప అర్బన్ : కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో గైనకాలజీ విభాగంలో అరుదైన శస్త్రచికిత్సలు నిర్వహించారు. సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్‌ఎస్ వెంకటేశ్వరరావు గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

- 13 ఏళ్ల బాలిక ముట్టు సమస్యతో గైనకాలజీ విభాగంలో చేరారు. పరీక్షించగా తనకు అరుదైన జన్యు వ్యాధి ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ చేసి ఎడమ వైపు హెర్నియాలో ఉన్న అండాశయాన్ని, ఎడమ వైపు ఉన్న గర్భసంచి సగభాగాన్ని తొలగించారు. ప్రపంచంలో ఇటువంటి కేసులు ఇప్పటి వరకు ఐదు మాత్రమే నమోదు అయ్యాయని సూపరింటెండెంట్ తెలిపారు.
- 46 ఏళ్ల మహిళ కడుపు ఉబ్బరంతో బాధ పడుతూ అడ్మిట్ అయ్యారు. పరీక్షలు చేశాక అండాశయంలో పెద్ద కణితిని గుర్తించారు. శస్త్ర చికిత్స చేసి 8 కేజీల కణితిని తొలగించారు.
- 55 ఏళ్ల మహిళ కడుపు నొప్పితో బాధపడుతూ అడ్మిట్ అయ్యారు. పరీక్షలు జరిపాక అండాశయ క్యాన్సర్ తో బాధపడుతున్నట్లు గుర్తించారు. శస్త్రచికిత్స చేసి 6 కేజీల క్యాన్సర్ గడ్డతోపాటు స్టేజింగ్ లాపారోటమీ అనే చికిత్స చేసి క్యాన్సర్ భాగాలను తొలగించారు.
- శస్త్ర చికిత్స చేశాక ముగ్గురు పేషెంట్స్ బాగా కోలుకున్నారని, అందరినీ డిశ్చార్జ్ త్వరలో చేస్తామని సూపరింటెండెంట్ తెలిపారు. అన్నీ శస్త్ర చికిత్సలు గైనకాలజీ హెచ్‌ఓడి డాక్టర్ లక్ష్మీసుశీల ఆధ్వర్యంలో డాక్టర్ అమానుల్లా, క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణుల నేతృత్వంలో చేసినట్లు పేర్కొన్నారు. గైనకాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సీలిమ, డాక్టర్ పద్మావతి, డాక్టర్ రబ్బాని బేగం, డాక్టర్ రేఖారావు, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, పీజీ వైద్యులు, స్టాఫ్ నర్సులు పాల్గొన్నట్లు తెలిపారు. అనస్థీసియా విభాగాధిపతి డాక్టర్ సునీల్ చిరువెళ్ల, అసోసియేట్ ప్రొఫెసర్స్ డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ మంజు శృతి, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పాల్గొన్నారు.

అరుణాచలం.. రైలులోనూ వెళ్దాం

- అతి తక్కువ చార్జీతో ప్రయాణం
- అన్ని వర్గాలకు అనుకూలం



అరుణాచలం వెళ్లే రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : పంచభూతాత్మక లింగాల్లో అగ్ని లింగం తేజోలింగంగా పేరొందిన అరుణాచలానికి వెళ్లే భక్తుల సంఖ్య ఉమ్మడి వైఎస్సార్ జిల్లా నుంచి అధికంగా ఉంటోంది. గిరి ప్రదక్షిణకు వేలాది మంది భక్తులు తరలి వెళుతున్నారు. కడప మీదుగా రైలు సదుపాయం ఉన్నా అవగాహన లేక భక్తులు బస్సులు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో రైల్వే సౌకర్యంపై సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం.

కడప నుంచి అరుణాచలానికి రోడ్డు మార్గాన వెళ్లేందుకు దాదాపు 300 కి.మీ. దూరం ఉంటోంది. ఆర్టీసీ బస్సుల్లో సూపర్ లగ్జరీల్లో అయితే దూరాన్ని బట్టి రానుపోను రూ.1050 నుంచి 1300 వరకు చార్జీగా ఉంది. ఒకవేళ కారులో వెళితే దాదాపు రూ. 8–10 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. వీటన్నింటితో పోలిస్తే రైలులో ప్రయాణిస్తే చార్జి తక్కువగా ఉన్నా.. రిజర్వేషన్ అందుబాటులో లేకపోవడంతో అనేక మంది ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది.

అందుబాటులో రైల్వేస్టేషన్లు


వైఎస్సార్ జిల్లా నుంచి పలు రైళ్లు అరుణాచలం సమీపానికి వెళుతున్నాయి. కడప నుంచి విల్లుపురం 360 కి.మీ. దూరంలో ఉంది. అయితే విల్లుపురం నుంచి అరుణాచలం 60 కి.మీ. దూరంలో ఉంది. ఎవరైనా అరుణాచలం వెళ్లాలంటే విల్లుపురం వరకు రైలులో వెళ్లి అక్కడి నుంచి రైలులో గానీ, బస్సులో గానీ, ఇతర వాహనాల్లో కూడా వెళ్లవచ్చు.

కడప మీదుగా వెళుతున్న రైళ్ల వివరాలు


అహ్మదాబాద్ నుంచి తిరుచానపల్లికి వెళ్లే వారాంతపు రైలు (09419) ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటలకు కడపకు చేరుకుని అదే రోజు సాయంత్రం 7.15 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. తిరిగి ఇదే రైలు (09420)మధ్యాహ్నం 12.10 గంటలకు విల్లుపురంలో బయలుదేరి కడపకు రాత్రి 8.25 గంటలకు చేరుతుంది. ఈ రైలు కడప స్టేషన్‌లో మాత్రమే ఆగుతుంది.

- లోకమాన్య తిలక్–మధురై (22101) రైలు ప్రతి గురువారం తెల్లవారుజామున 5.40 గంటలకు కడపకు చేరుకుని.. అదే రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు విల్లుపురం చేరుతుంది. తిరుగు ప్రయాణంలో (22102) రైలు విల్లుపురంలో శుక్రవారం రాత్రి 8.40 గంటలకు బయలుదేరి.. మరుసటిరోజు తెల్లవారుజామున 3.10 గంటలకు కడపకు చేరుతుంది. ఈ రైలులో రానుపోను రూ.550 చార్జిగా నిర్ణయించారు.
- ముంబయి–కరైకాల్ ఎక్స్‌ప్రెస్ (11017) వారాంతపు రైలు ప్రతి ఆదివారం తెల్లవారుజామున 5.40 గంటలకు కడపకు చేరుకుని మధ్యాహ్నం 1.55 గంటలకు విల్లుపురం చేరుతుంది. తిరిగి ఇదే రైలు (11018) విల్లుపురంలో సాయంత్రం 7.25 గంటలకు బయలుదేరి.. మరుసటిరోజు తెల్లవారుజామున 3.10 గంటలకు కడపకు చేరుతుంది.
- ముంబయి–నాగర్‌కోయిల్ (16351) ఎక్స్‌ప్రెస్ రైలు వారానికి రెండు సార్లు నడుస్తుంది. ఈ రైలు ప్రతి మంగళ, శని వారాల్లో మధ్యాహ్నం 1.20 గంటలకు కడపకు చేరుకుని, అదే రోజు రాత్రి 9.30 గంటలకు విల్లుపురం చేరుతుంది.
- కడప నుంచి అరుణాచలానికి ఓకా–మధురై (09520) ఎక్స్‌ప్రెస్ రైలు అందుబాటులో ఉంది. ఈ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం సాయంత్రం 6.05 గంటలకు కడపకు చేరుకుని మరుసటి రోజు తెల్లవారుజామున 3.40 గంటలకు అరుణాచలానికి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ఇదే రైలు (09519) అరుణాచలంలో శుక్రవారం ఉదయం 7.30 గంటలకు బయలుదేరి.. అదే రోజు మధ్యాహ్నం 1.55 గంటలకు కడపకు చేరుతుంది. ఈ రైలులో జనరల్ క్లాస్‌లో రూ.140, స్లీపర్‌లో రానుపోను రూ. 790, ఏసీ త్రీ టైర్‌లో రూ.2370లుగా చార్జీ నిర్ణయించారు.
- కాచిగూడ–పాండిచ్చేరి వెళ్లే రైలు (17653) ప్రతి సోమ, గురు, శనివారాల్లో కాచిగూడలో సాయంత్రం 5 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి 1.30 గంటలకు కడపకు చేరుకుని ఉదయం 9.00 గంటలకు విల్లుపురం చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం 3 గంటలకు విల్లుపురంలో బయలుదేరి రాత్రి 10 గంటలకు కడపకు చేరుకుంటుంది.

డ్రాగా ముగిసిన కడప-అనంతపురం మ్యాచ్



కడప రోహిత్ వర్మ (133 పరుగులు)



చిత్తూరు లోహిత్ లక్ష్మీ నారాయణ (138 పరుగులు)



చిత్తూరు ఘని (5 వికెట్లు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ డే మ్యాచ్‌లో మూడవ రోజు గురువారం కడప–అనంతపురం జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్ డ్రాగా ముగిసింది. వైఎస్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో 74 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన కడప జట్టు 107 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 455 పరుగులు చేసింది. ఆ జట్టులోని రోహిత్ వర్మ 204 బంతుల్లో 133 పరుగులు, ఆర్థిత్ రెడ్డి 156 బంతుల్లో 111 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని వరుణ్ సాయి నాయుడు 4 వికెట్లు తీశాడు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. దీంతో కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో అధిక్యం సాధించింది.

కేఓఆర్ఎం మైదానంలో..

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మరో మ్యాచ్‌లో కర్నూలు జట్టుపై చిత్తూరు జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మూడవ రోజు గురువారం 143 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 71.2 ఓవర్లలో 272 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని హృదయ్ 85 పరుగులు, విఖ్యాత్ 85 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని ఘని చక్కటి లైనప్‌తో బ్యాటింగ్ చేసి 5 వికెట్లు తీశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 42.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 304 పరుగులు చేసింది. ఆ జట్టులోని లోహిత్ లక్ష్మీ నారాయణ 113 బంతుల్లో 138 పరుగులు చేశాడు.